క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు కృషి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని ఎస్‌టీయూ జిల్లా కార్యదర్శి, వక్కలిపేట మున్సిపల్ ప్రైమరీ ఉర్దూ స్కూల్ హెడ్ టీచర్ ఎస్.నజీబుల్లా పేర్కొన్నారు. గురువారం నగర సమీపంలోని తమ పాఠశాలలో పిల్లలతో కలిసి మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా మొక్కలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సల్మా, సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రటరీ రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ ఆర్ఐఓకు వినతి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో మౌలిక వసతులు సరిగా లేని జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న కోరారు. ఈ విషయమై గురువారం ఇంటర్ ఆర్ఐఓ వెంకటసుబ్బయ్యను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అల్లా బాష, గంగాధర్, తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి భాగవత సప్తాహం

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానం శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోగల సత్సంగ వేదికపై ఈనెల 22 నుంచి వారం రోజులపాటు దేవి భాగవత సప్తాహం నిర్వహిస్తున్నామని శ్రీ బిట్రా పట్టాభి రామయ్య భగవద్గీత సత్సంగం అధ్యక్షులు కె.సుబ్బారెడ్డి తెలిపారు. దర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా నంబూరు కాశీవన ఆశ్రమం నుంచి బహుముఖ ప్రజ్ఞాశాలి, ఆధ్యాత్మిక ప్రవచనకర్త శ్రీనివాస రామానుజదాసు రోజూ దేవీ భాగవతంపై ప్రవచనాలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

22న స్నాతకోత్సవం

కడప ఎడ్యుకేషన్: కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ 2020-24 బ్యాచ్‌లో విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు ఈ నెల 22వ తేదీ కేఓఆర్ ఆడిటోరియంలో 7వ స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ జీవీఆర్ శ్రీనివాసరావు వస్తున్నట్లు తెలిపారు. ఆయన విద్యార్థినీ విద్యార్థులకు పట్టాలను అందించడంతోపాటు బ్రాంచుల వారిగా ప్రశంసాపత్రాలను అందజేస్తారన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



విద్యార్థినిలకు సూచనలిస్తున్న వైద్య బృందం

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాలికలు రుతుక్రమ సమయంలో వ్యక్తిగత శుభ్రత పాటించాలని వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ వర్దన్ తెలిపారు. శుక్రవారం కడప నగర పరిధిలోని నాగరాజుపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ వర్ధన్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత ఆధ్వర్యంలో కడప నగరంలోని ఉర్దూ స్కూలులో బాలికలు రుతుక్రమం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, నాప్కిన్స్ వాడటం, తిరిగి వాడిన వాటిని డిస్పోస్ చేయడం తదితర విషయాలపై తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రశాంత్ వర్దన్, డాక్టర్ నితీష్ కుమార్ మాట్లాడుతూ వివిధ రకాల విటమిన్ల లోపం కారణంగా విద్యార్థినిలు వివిధ రకాల వ్యాధులకు గురవుతున్నారు. విటమిన్లతో కూడిన బ్యాలెన్స్ డైట్ ప్రతిరోజు తప్పకుండా వాడి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. డాక్టర్ కౌశిక్ , డాక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



యోగా గురువు పద్మావతిని సన్మానిస్తున్న ప్రముఖులు

కడప ఎడ్యుకేషన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కడప ట్రంక్‌రోడ్డులోని మౌలానా ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటి అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో సీనియర్ యోగా గురువు పద్మావతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ క్లబ్ కో చైర్మన్ మొహమ్మద్ తాజుద్దీన్ పాల్గొని ఆమె అందించిన యోగా సేవలను కొనియాడారు. కడప నగరంలో యోగా గురువు పద్మావతి 23 సంవత్సరాల నుంచి ఉచితంగా సేవలందిస్తున్నారన్నారు. ఈ విషయంలో ఆమె రాష్ట్రస్థాయిలో పలు అవార్డులు, సన్మానాలు అందుకోవడం ప్రశంసనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో దంత వైద్యులు పర్హానుద్దీన్, ఉష, ఎస్ రెడ్డిలక్ష్మి, రమాదేవి, సొసైటీ సభ్యులు సిద్దిక్ అలీ అహ్మద్, సయ్యద్‌సుల్తాన్ సలావుద్దీన్, మొహమ్మద్‌షా నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యయోగం

అడుగేస్తే ఆయాసం...కారణం ఊబకాయం....శ్వాస తీసుకునేందుకే కష్టం....కారణం శ్వాసకోశ సమస్యలు. షుగర్, అధిక బీపీ బాధలు. డబ్బు, విలాసాలు అనుభవిస్తూనే ఉన్నా... ఏదో తెలియని దిగులు. ఇతరులను చూస్తే అసంతృప్తి.... ఈ సమస్యలకు కారణం మనసు, శరీరాలే. రెండూ విభిన్నమే అయినా వాటి మధ్య ఏదో లింక్ తెగిన భావన. కలిపే శక్తి, హాయిగా నడిపే శక్తిపేరే యోగా. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం. ఈ సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.



యోగా.. ఓ ఔషధం..



యోగాతో నేను అన్న ఆలోచన మనం అనే మహా సముద్రంలో సంయోగం అవుతుంది. యోగం అంటే సంయోగమే. యోగా ద్వారా మనలో పొందిన ప్రేమ, శక్తిని నలుగురితో పంచుకోవాలి. జ్ఞానాన్ని సమాజానికి అందివ్వాలి. స్వీయ ముక్తి, లోక కల్యాణమే యోగా అంతిమ లక్ష్యం. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగ చక్కటి ఔషధంగా పనిచేస్తుంది.

- డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, యోగా థెరఫిస్టు, కడప

కడప కల్చరల్: మన సంస్కృతిలో ఆది నుంచి యోగాకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. జన్మస్థలి గనుక మన దేశం ప్రపంచంలోని అగ్రరాజ్యాలతో సైతం ఆసనాలు వేయిస్తోంది. యోగా ద్వారా ఆరోగ్యాన్ని ప్రపంచమంతా పంచేందుకు 2014లో ఐక్యరాజ్య సమితి అంగీకరించడంతో 177 దేశాలలో యోగా చేస్తున్నారు.

మన యోగా మహాన్

జిల్లాలో యోగా పట్ల ఇటీవల మంచి స్పృహ వచ్చింది. పలు యోగా సెంటర్లు సాధకులతో కళకళలాడుతున్నాయి. కడప నగరంలో మిత్ర యోగా కేంద్రం, విశ్వాత్మ పిరమిడ్ యోగా సొసైటీ, అమ్మవారిశాల, ఆఫీసర్స్ క్లబ్, ఆంజనేయ యోగా కేంద్రం, రామచంద్ర మిషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలలో యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. తర్వాత ప్రొద్దుటూరు, రాజంపేట, బద్వేలు, రాయచోటితో పాటు ప్రస్తుతం దాదాపు అన్ని మండల కేంద్రాల్లో కూడా యోగా, ధ్యాన కేంద్రాలు వెలిశాయి. ప్రత్యేకించి ఓం శాంతి సంస్థ పేరిట బ్రహ్మకుమారీ ఈశ్వరీయా విశ్వవిద్యాలయం సభ్యులు యోగా, ధ్యానం ద్వారా ప్రజల్లో శాంతిని నెలకొల్పేందుకు కృషి చేస్తున్నారు.

గురువులు–సేవలు

కడప నగరంలో సీనియర్ యోగా మాస్టర్ నామా నరసింహయ్య అమ్మవారిశాలలో పాతికేళ్లుగా ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నారు. మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ నిర్వాహకులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, డాక్టర్ కె.కల్పనలు యోగా గురించి విస్తృత ప్రచారం చేశారు. నగర శివార్లలోగల ఆంజనేయ పిరమిడ్ సొసైటీ కూడా పలు సంవత్సరాలుగా శిక్షణ ఇస్తోంది. సీనియర్ యోగా మాస్టర్ సిద్దయ్య, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలో వీరభద్రారెడ్డి, హరినాథరెడ్డి యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. కడప నగరంలోని ప్రైవేటు హైస్కూలులో వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులను యోగా రంగంలో జాతీయ స్థాయి బహుమతులను అందుకునేలా తీర్చిదిద్దారు. జిల్లాలో 60 యోగా సెంటర్ల ద్వారా ఏడు వేల మందికి పైగా శిక్షణ పొందుతున్నారు. మొండి వ్యాధులు సైతం నయం అవుతాయన్న నమ్మకంతో యోగా బాట పడుతున్నారు. జిల్లాలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు యోగా విద్యలో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి జిల్లాకు మంచి పేరు తెస్తున్నారు.

సరిగమ... మధురిమ

సంగీతం ఓ సముద్రం లాంటిది. ఇందులో ఎంత ఈదినా తనవి తీరదు... అలసట ఉండదు... కవితాత్మకమైన మాటలకు మంచి బాణీ కూర్చితే మధురమైన పాట అవుతుంది. మదిని కట్టేస్తుంది. ఆనందంతో ఊపేస్తుంది. పల్లెటూరి దప్పు అయినా.... పండితుని మృదంగం అయినా... ఒకేస్థాయిలో మనసును రంజింపజేస్తాయి. కష్టజీవి నుంచి మహా విద్వాంసుని వరకు సంగీతమంటే అందరికీ ఇష్టమే. నేడు ప్రపంచ సంగీత దినోత్సవం. ఈ సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.



కడప నగరంలో సంగీతం నేర్పుతున్న మాస్టారు రామాచారి



సంగీత సాధనలో విద్యార్థినులు

కడప కల్చరల్ : సంగీతం మహా సముద్రం లాంటిది. గురువులు ఎప్పటికప్పుడు ఆ సప్త అక్షరాలతోనే మధురిమలు అందించే రాగాలను సృష్టిస్తారు. మంచి పాట, సంగీతం, మనసుతోపాటు శరీరాన్ని కూడా ఊపేస్తుంది. శ్రమను మరిచే క్రమంలో కష్టజీవి, సంగీతంలో మునిగితేలే పండితుడు దాన్ని ఒకేలా ఆస్వాదిస్తారు. మరికొందరు దీనిని దైవ స్వరూపంగా ఆరాధిస్తున్నారు. పశువును, శిశువును చివరికి విషం చిమ్మే పామును కూడా మైమరిపించే శక్తి సంగీతానికే ఉందంటారు. సంగీతం ఓ మధురమైన లోకం అంటారు.

మన గడపలో...

సంగీత రంగంలో కూడా మన జిల్లా ప్రత్యేకతను చాటుకుంటోంది. మన జిల్లాకు కళల జిల్లాగా గొప్ప పేరుంది. సంగీతం విషయంలో పదకవితా పితామహులు అన్నమాచార్యులు తన కీర్తనలకు కట్టిన బాణీలు నేటికీ సామాన్యులను సైతం ఓలలాడిస్తున్నాయి. మహా కవి పుట్టపర్తి నారాయణాచార్యుల శివతాండవ కావ్యం సంగీత భరితం కావడంతోనే దానికి విశేష కీర్తి ప్రతిష్ఠలు లభించాయి. గణిత మేధావి లక్కోజు సంజీవరాయశర్మ మంచి వాయులీన విద్వాంసులు. దాన్ని వాయిస్తూ ఎంత క్లిష్టమైన లెక్కకైనా టక్కున జవాబు చెప్పేవారు.

వారి వారసులుగా..

నిన్నటితరం సంగీత కర్తలకు నేటితరం వారు వారసులుగా నిలుస్తున్నారు. శ్రీరామ నవకాంత్, గిరిజ, గువ్వల సుబ్బరాయుడు, టీవీఎస్ ప్రకాశ్, శ్రీవాణి అర్జున్ గాయకులుగా విశేషమైన గుర్తింపు సాధించారు. వీరిలో కొందరు సినిమాల్లో కూడా పాడారు. నేలబొట్ల చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు ఈ రంగంలో కృషి చేస్తున్నారు. ప్రొద్దుటూరుకు చెందిన యువతి కావ్యచందన, గతంలో ఆరవేటి శ్రీనివాసులు, మునెయ్య జానపద గాయకులుగా పేరుగాంచారు. ఆర్టీ ప్రసాద్‌రావు జిల్లాలో మంచి సంగీత దర్శకుడిగా పేరు పొందారు.

- కడప నగరానికి చెందిన యువకుడు వాట్‌కిన్స్ సినిమా సంగీత దర్శకుడిగా, పెంచలదాసు గాయకునిగా రాణిస్తున్నారు. వాయిద్య విభాగంలో తబల సోమయ్య, తబల సుబ్బరాయుడు, గిటారు కళాకారుడు రంజన్, ఆరు తబలాలను ఒకేసారి పలకించగల దిట్ట దండు శ్రీనాథమణి జిల్లాకు ఖ్యాతి తెచ్చారు. ఆయన తబలాపై ప్రత్యేకంగా 'తబలా ఘరాన' పేరిట పెద్ద పుస్తకం రాశారు. కొన్నేళ్లపాటు పుట్టపర్తి సాయిబాబా ఆశ్రమంలో నిలయ విద్వాంసుడిగా పనిచేశారు.

చూపున్న పాట

జిల్లాలో సంగీత పండితుడు సాంబ శివునిది మరో ప్రపంచం. ఆయన అంధుడైనా విఖ్యాత గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యంను సైతం తన గానంతో ఆకట్టుకున్నారు. బాలు ఆహ్వానంపై సాంబ శివుడు పలు టీవీ, సంగీత కార్యక్రమాలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. జిల్లాకు చెందిన 'బంటి' రుతురాగాలు తదితర ఎన్నో టీవీ సీరియళ్లకు సంగీతం అందించి ప్రముఖుడిగా స్థిరపడ్డారు. పీడీ బాలసుబ్రమణ్యం జిల్లాలో ఆర్కెస్ట్రాకు ఆద్యుడిగా నిలిచారు. ఆయన స్ఫూర్తితో నేడు జిల్లాలో 50కి పైగా ఆర్కెస్ట్రాలు ఏర్పడ్డాయి. గాయకుడు పీఎం రవికుమార్‌బాబు కడప నగరంలో అధునాతన రికార్డింగ్ థియేటర్ ఏర్పాటు చేశారు. బాబ్ అండ్ బాబ్ ఆర్కెస్ట్రా నిర్వాహకులు బాబుతోపాటు మరికొందరు రికార్డింగ్ సెంటర్లతో సంగీత రంగంలో రాణిస్తున్నారు. జిల్లాలో పలువురు సంగీతాజ్ఞులు ప్రత్యేక పాఠశాలల ద్వారా పిల్లలకు సంగీతం నేర్పుతున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయం

– బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా భారతీయ జనతా పార్టీ కార్యచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. గురువారం కడప నగరంలోని బీజేపీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కార్యవర్గ సమావేశంలో ప్రధానంగా రాబోయే రోజుల్లో పార్టీని ఏ విధంగా ముందుకు తీసుకు వెళ్లాలనే అంశంపై చర్చ కొనసాగిందన్నారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందించాలని నిర్ణయించామన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బీజేపీ ఆధ్వర్యంలో విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈనెల 23 నుంచి జులై 6వ తేదీ వరకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు పర్యావరణ సమతుల్యత కోసం విరివిగా మొక్కలు నాటాలని తీర్మానించామన్నారు.

సేవల్లో రెవెన్యూ వ్యవస్థ చాలా కీలకం

– ఆర్డీఓ మధుసూదన్



రెవెన్యూ ఉద్యోగిని సత్కరిస్తున్న ఆర్డీఓ మధుసూదన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రభుత్వ పథకాలు అమలు, ప్రజలకు సేవలు అందించడంలో రెవెన్యూ వ్యవస్థ కీలకమని కడప రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్ తెలిపారు. గురువారం జిల్లా వ్యాప్తంగా రెవిన్యూ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా కడప నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మధుసూదన్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పనితీరు రెవెన్యూశాఖ ద్వారానే తెలుస్తుందన్నారు. రెవెన్యూ సిబ్బంది అటు ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తూ ఇటు ప్రజలతో మమేకమవుతూ ప్రతినిత్యం బిజీగా ఉండాల్సి వస్తుందన్నారు. ఈ విషయంగా రెవెన్యూ అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ప్రజలకు రెవెన్యూశాఖతోనే న్యాయం జరుగుతుందని ఆయన వివరించారు. అనంతరం రెవెన్యూశాఖలో సుదీర్ఘంగా సేవలు అందిస్తున్న పలువురు అధికారులు, సిబ్బందిని కడప ఆర్డీఓ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ హైవే పనులకు నిర్వాసితులు సహకరించాలి

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి 4 లేన్ల జాతీయ రహదారి నిర్మాణంలో నిర్వాసితులైన తమకు పునరావాసం కల్పించాలని కమ్మవారి పల్లె వాసులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఎన్‌హెచ్ అధికారులు, నిర్వాసితులతో ఆర్డీవో శ్రీనివాసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారి పనులకు ఆటంకం కల్పించవద్దని, నిబంధనల మేరకే పనులు, పరిహారం చెల్లిస్తున్నామని తెలిపారు. అయితే నిర్వాసితులు మాట్లాడుతూ సుమారు 40 ఏళ్ల క్రితం ప్రభుత్వమే స్థలాలు కేటాయించడంతో ఇళ్లు నిర్మించుకున్నామని, ప్రస్తుతం రహదారి తమ ఇళ్ల ముందే నిర్మాణం జరుగుతుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం వుందని తెలిపారు. 4 లేన్ల రహదారి ప్రక్కనే నివాసం చేయలేమని, తమకు పునరావాసం కల్పిస్తే మరో చోట ఇళ్లు నిర్మించుకుంటామని వాదనకు దిగారు. అయితే నిబంధనల మేరకే రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు, స్థానికుల నివాసానికి ఇబ్బంది లేకుండా హైవే అధికారులు గ్రామాన్ని సందర్శించి తగిన చర్యలు తీసుకుంటారని ఆర్డీవో తెలిపారు.

వారసత్వ రక్షణ, పర్యాటకానికి వేదిక 'మన చరిత'

– వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్



మన చరిత బులిటిన్‌ను ఆవిష్కరిస్తున్న వైవీయూ వీసీ, ఇతర అతిథులు

కడప కల్చరల్ : జిల్లాలోని ఘన వారసత్వ సంపదను పరిరక్షించి పర్యాటకానికి అనువుగా తీర్చిదిద్ది ఆ రంగంలో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు 'మన చరిత బులెటిన్' ఉపయోగపడగలదని వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. ఇంటాక్ ఆధ్వర్యంలో గురువారం ఆయన 'మన చరిత బులెటిన్'ను ఆవిష్కరించారు. నగరంలోని మానస ఇన్ సమావేశ మందిరంలో ఇంటాక్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ మన ఘనమైన వారసత్వ సంపదను రక్షించుకోగలిగితే జిల్లా పర్యాటకంగా కూడా అభివృద్ధి చెంది యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ జిల్లా వారసత్వ సంపద, సంస్కృతి సంప్రదాయాల రక్షణ గురించి అందరికీ అవగాహన కల్పించడానికి ఈ బులెటిన్‌కు రూపకల్పన చేశామన్నారు. వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర రెడ్డి , సంస్థ పూర్వ కన్వీనర్ ఎస్.ఎలియాస్ రెడ్డి మాట్లాడుతూ మన చరితకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. లయన్ ఖాసింఖాన్, వాసవి గ్రాఫిక్స్ అధినేత లయన్ పీవీ రమేష్, ఇంటాక్ కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, లయన్ పోతుల వెంకటరామిరెడ్డి తదితరులు మాట్లాడారు. బులెటిన్ విడుదల కు సహకరించిన వాసవి గ్రాఫిక్స్ అధినేత లయన్ పీవీ రమేష్‌తో పాటు బాలగొండ గంగాధర్, ఎద్దుల చిన్నప్పరెడ్డి, సగాా బాలకృష్ణ, కొత్తాస్ కుమార్, గౌరీ శంకర్, తాహిర్, మయూరా వెంకటేష్ వర్మ తదితరులను వీసీ సత్కరించారు. సంస్థ సభ్యులు కొండారెడ్డి, రాఘవేంద్ర వర్మ, కొండూరు జనార్దన్ రాజు, జోజిరెడ్డి, సంజీవరెడ్డి, గురు మోహన్ రెడ్డి, సుబ్బారెడ్డి, డాక్టర్ పుత్తా బాలి రెడ్డి, రాణి పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలని డీఈఓకు వినతి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: మినిమం టైం స్కేల్ పద్ధతిలో పునర్నియామకం పొందిన 1998, 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు జీతాల చెల్లింపునకు ఉత్తర్వులు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. ఈ విషయమై గురువారం డీఈఓ అనురాధను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సివిరమణ, ఏజాస్ అహ్మద్, నాయకులు గోపీనాథ్, చంద్రశేఖర్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 117ను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్: విద్యాశాఖలో పెనుముప్పుగా ఉన్న జీఓ నంబర్ 117ను తక్షణం రద్దు చేయాలని ఆర్‌జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం కడపలోని భుజంగరావు స్మారక టీచర్స్‌హోంలో ఆర్‌జేయూపీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమం కూడా కొనసాగించాలన్నారు. అలాగే గతంలో మాదిరిగానే 3,4,5 తరగతులను ప్రాథమిక విద్యలో కొనసాగించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ విద్యాశాఖలో ఖాళీగా ఉన్న అన్ని క్యాడర్ల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. ఆర్‌జేయూపీ సంఘం అధికార ప్రతినిధి ముత్తోజి వీరబ్రహ్మం మాట్లాడుతూ నూతన ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించడం హర్షనీయం అన్నారు. ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్ర ఓబుల్‌రెడ్డి, టీచర్స్ హోం ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సీనియర్ నాయకులు వీరన్న, వీరయ్యలతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

సిద్దవటం: మండలంలోని జంగాలపల్లె, వెలుగుపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలతో పాటు వంతాటిపల్లె (మెయిన్) ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రిని ఎంఈఓ విలియంరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ వంతాటిపల్లె ఉపాధ్యాయుడు డీవీఎస్ ప్రసాద్‌రెడ్డి తండ్రి దూళ్ల వెంకటసుబ్బారెడ్డి(రిటైర్డ్ ఏఎస్ఐ) జ్ఞాపకార్థం విద్యార్థులకు పలకలు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లను ఉచితంగా పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జంగాలపల్లె మాజీ సర్పంచ్ ముసలి శ్రీనివాసులరెడ్డి, వెలుగుపల్లెకు చెందిన కుప్పం వెంకటసుబ్బారెడ్డి, మాచనూరు వెంకట సుబ్బారెడ్డి, పల్లె వెంకట సుబ్బారెడ్డి , ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

సిద్దవటం: తహసీల్దారు కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని సిద్దవటం తహసీల్దారు మురాషావలి తమ సిబ్బందికి సూచించారు. సిద్దవటంలోని తహసీల్దారు కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో రెవెన్యూ శాఖ ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించడంతో పాటు, ప్రకృతి వైపరీత్యాలు, కరోనా సమయంలో కీలకంగా వ్యవహరించిందన్నారు. ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా వారి పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మాధవీలత, ఏఎస్ఓ శివప్రసాద్, ఆర్ఐ అనూరాధ, సీనియర్ అసిస్టెంటు చంద్ర, జూనియర్ అసిస్టెంటు శ్రీనివాసులు, వీఆర్‌ఓలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణకు బీసీజీ టీకా తప్పనిసరి

రాయచోటి అర్బన్: క్షయవ్యాధి నివారణకు వయోజనులంతా బీసీజీ టీకా వేయించుకోవాలని యండపల్లె పీహెచ్‌సీ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ వై.విశ్వనాథరెడ్డి అన్నారు. గురువారం రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామం సిద్దారెడ్డిగారిపల్లెలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి వ్యాప్తికి ఎక్కువగా అవకాశముండే వయోజనులకు బీసీజీ టీకాలను ఇవ్వడం ద్వారా కొత్తగా ప్రబలే టీబీ కేసుల తగ్గింపునకు అవకాశముందన్నారు. ఈ సందర్భంగా శిబ్యాల ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని 36 మందికి వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో శిబ్యాల ఉపకేంద్రం ఏఎన్ఎం సరస్వతి, సచివాలయం ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లి: లక్కిరెడ్డిపల్లి సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయ ఒక ప్రకటనలో తెలిపారు. 6,7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్లకు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకుంటే 27వ తేదీ ఉదయం 9 గంటలకు లక్కిరెడ్డిపల్లి గురుకుల పాఠశాలలో పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న మహాభారత యజ్ఞం

రామాపురం: మండల కేంద్రంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం అర్జునుడు తన తపశ్శక్తితో పాశుపతాస్త్రాన్ని శివుని ద్వారా సంపాదించిన మహా ఘట్టాన్ని నాటక రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని పలు గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించారు.